క్లుప్తంగా

ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నరసింహప్రసాద్


నరసింహ ప్రసాద్‌రెడ్డి

పుంగనూరు: పుంగనూరు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌ను కుప్పం ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడ కమిషనర్‌గా ఉన్న రవిరెడ్డి సెలవులో వెళ్లడంతో ఆయనను ఇన్‌చార్జిగా నియమించారు. ప్రస్తుతం బి.కొత్తకోట ఇన్‌చార్జ్ కమిషనర్‌గా కూడా ఈయన కొనసాగుతున్నారు. సోమవారం నుంచి ఆయన కుప్పంతో కలుపుకుని మూడు మున్సిపాలిటీలకు కమిషనర్‌గా వ్యవహరించనున్నారు.

దాతలకు మాజీ సైనికుల సన్మానం



మాట్లాడుతున్న విజయశంకర్‌రెడ్డి

పలమనేరు: ఫ్లాగ్‌డే కార్యక్రమానికి విరాళిచ్చిన దాతలను స్థానిక మాజీ సైనికులు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఆదివారం పట్టణంలోని నార్త్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా సైనిక సంక్షేమ అధికారి విజయశంకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం కష్టపడే సైనికుల సంక్షేమానికి రూ.90వేలు విరాళమిచ్చిన పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలను సన్మానించడం ఆనందదాయకమన్నారు. సంఘం అధ్యక్షుడు పయణి తదితరులు పాల్గొన్నారు.

టీ దుకాణం దగ్ధం

రామకుప్పం: మండలంలోని చెల్దిగానిపల్లెలో శనివారం అర్ధరాత్రి టీ దుకాణం దగ్ధమైంది. వివరాలు.. చెల్దిగానిపల్లెకు చెందిన సరోజమ్మ గుడిసెలో టీ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. శనివారం అర్ధరాత్రి హఠాత్తుగా గుడిసెకు నిప్పు అంటుకున్నట్లు స్థానికులు సరోజమ్మకు సమాచారం అందించారు. ఆమె అక్కడికి వెళ్లే సరికి గుడిసె పూర్తిగా కాలిపోయింది. ఆదివారం ఆమె ఈమేరకు రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వంట సామాగ్రి, పాత్రలు, టేబుళ్లు, పెట్టెలో ఉంచిన సుమారు రూ.10 వేల నగదు కాలిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

సోమల: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక కొత్తపేట వీధికి చెందిన సాంబయ్య కుమారుడు మోహన్‌కుమార్ సొంతపనిపై సినిమా క్రాస్ సమీపంలో ని వెంకటాచలపతి పొలం వద్దకు బయలు దే రాడు. మార్గమధ్యంలో పోలీస్ స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని తిరుపతి నుంచి పుంగనూరు వె ళుతున్న పుంగనూరు డిపో ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ ఘటనలో మోహన్ కుమార్ తీవ్రంగా గాయ పడ్డాడు. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన చికి త్స కోసం పీలేరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం

రామకుప్పం: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ సుబ్రమణ్యం అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మురళి తెలిపారు. మండల అధికారులు, వివిధ దళిత సంఘాల నేతలు పాల్గొనాలన్నారు.

మైలేరుకు పోలీసుల అనుమతి లేదు

పలమనేరు: మండలంలోని మండిపేట కోటూరులో మైలేరు(ఎడ్ల పరుగు పందేలు)కు పోలీసుల అనుమతి లేదని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. గ్రామంలో మైలేరు ఏర్పాట్లను ఆదివారం ఎస్‌ఐ నాగరాజు సిబ్బందితో కలసి అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ కొందరు నిర్వాహకులు కేవలం పండుగను వ్యాపారంలా మార్చి పోటీల్లో పాల్గొనే ఎద్దుల యజమానుల నుంచి భారీగా డబ్బు వసూలు చేస్తున్నారని తెలిపారు. మండలంలో ఎక్క డైనా మైలేర్లను నిర్వహిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంచి ప్రతిభ చూపే విద్యార్థులకు రూ.10వేల నగదు ప్రోత్సాహకాలను ఇకపై అందించనున్నట్టు ఇదే పాఠశాలలో హెచ్‌ఎంగా ఉద్యోగ విరమణ చెందిన చంద్రమ్మ ప్రకటించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదవాలన్నారు. హెచ్‌ఎం కుప్పమ్మ, యూటీఫ్ నాయకుడు సోమచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

సదుం: మండలంలోని బూరగమంద క్రాస్ వద్ద సారా విక్రేతను అరెస్టు చేసినట్టు పులిచెర్ల ఎస్‌ఈబీ అధికారులు ఆదివారం సాయంత్రం తెలిపారు. చీకలచేనుకు చెందిన వివేకనంద సారా విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, రిమాండుకు తరలించినట్టు చెప్పారు. దాడుల్లో ఎస్‌ఐ కవీశ్వర్ నాయుడు, హెచ్‌సీ సుధాకర, విజయ్, ఈసీ మధు పాల్గొన్నారు.

జగనన్నకే మా ఆశీర్వాదం

పుంగనూరు: సంక్షేమ పథకాలతో మా జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం జగనన్నే ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉండాలి, ఏ ఎన్నికల్లో అయినా ఆయనకే మా ఆశీర్వాదం అని పుంగనూరు మున్సిపాలిటీ, మండలంలో ఆదివారం జరిగిన జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో లబ్ధిదారులు ముక్తకంఠంతో తెలిపారు. మున్సిపల్ పరిధిలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ అమ్ము, రాయలసీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దిన్‌షరీఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేఎస్‌ఏ.ఇఫ్తికార్ అలీఅహమ్మద్ ఆధ్వర్యంలో 31వ వార్డులో కౌన్సిలర్లు, గృహసారథులు, వలంటీర్లు నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మండలంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ కొత్తపల్లె చెంగారెడ్డి ఆధ్వర్యంలో చంద్రమాకుల పల్లె, ఈడిగపల్లె, మంగళం, వనమలదిన్నె, ఆరడిగుంట గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. నాయకులు జయరామిరెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, రాజేష్, కొండవీటి నరేష్, లక్ష్మణ్‌రాజు, శ్రీనివాసులు,బాలు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు మున్సిపల్‌పరిధి, మండలంలోని పలు సచివాలయాల పరిధిల్లో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఆదివారం జోరుగా సాగింది. సచివాలయాల కన్వీనర్లు, పార్టీశ్రేణులు, గృహసారథులు ఇంటిటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరించారు. వారి సమ్మతి మేరకు ఇళ్లకు స్టిక్కర్లను అతికించి, ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు వస్తోంది. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లు మురళీకృష్ణ, షబ్బీర్ రెహానా, హయాత్‌బాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రూరల్ మండలంలోని పెంగరగుంట సచివాలయ పరిధిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షులు రాజారెడ్డి, వి.గౌడ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.


పుంగనూరు: రహమత్ నగర్‌లో అభిప్రాయ సేకరణ


బైరెడ్డిపల్లె: దేవదొడ్డిలో వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం


రామకుప్పం: కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు


పుంగనూరు: చంద్రమాకులపల్లెలో..

రామకుప్పం: రామకుప్పం, సింగసముద్రం, మణీంద్రం,పెద్దూరు పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఇబ్రహీంఖాన్ ఆధ్వర్యంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు వేసి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ప్రజలంతా ప్రభుత్వానికి అనుకులంగా సమాధానం ఇస్తున్నారని సర్పంచ్ తెలిపారు. వార్డు మెంబర్ చిన్న నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం: మండలంలో 16 పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వంలో, ఇప్పుడు కలిగిన మేలును వివరించారు. ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. సొన్నేగానిపల్లి పంచాయతీలో జెడ్పీటీసీ శ్రీనివాసులు, కెనమాకులపల్లె పంచాయతీలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రఘురామిరెడ్డి, తుమ్మిశి, కడపల్లె పంచాయతీల్లో మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, తుమ్మిశిలో వైస్ ఎంపీపీ పట్టాభి పాల్గొన్నారు.

సదుం: మండలంలో ఆదివారం 18 పంచాయతీల పరిధిలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం కొనసాగింది. సదుంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.సచివాలయాల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

చౌడేపల్లె: మండలంలోని దుర్గసముద్రంలో జగనన్నే మా భవిష్యత్తు, మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సర్పంచ్ సరస్వతమ్మ ఆధ్వర్యంలో జరిగింది. పార్టీనేతలు, సచివాలయ కన్వీనర్, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. శెట్టిపేటలో సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, గడ్డంవారిపల్లెలో సర్పంచ్ భాగ్యవతి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

బైరెడ్డిపల్లె: మండలంలోని గంగినాయనపల్లె, దేవదొడ్డి, బైరెడ్డిపల్లె సచివాలయ పరిధిల్లోని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, జెడ్పీటీసీ కేశవులు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరించారు. అభిప్రాయాలను సేకరించారు. పార్టీ మండల కన్వీనర్ కార్తీక్, సచివాలయ కన్వీనర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు పాల్గొన్నారు.

పులిచెర్ల (కల్లూరు): మండలంలోని 102 ఇ.రామిరెడ్డి గారిపల్లెలో ఆదివారం సర్పంచ్ బాల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు జగనన్నే మాభవిష్యత్తు–మానమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు ఉన్న తేడాను వివరించారు.




కల్లూరు : 102 ఇరామిరెడ్డి గారిపల్లెలో..., పుంగనూరు: స్టిక్కర్ అంటిస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, చౌడేపల్లె: దుర్గసముద్రంలో..


సదుం: నడిగడ్డలో..



శాంతిపురం: వెంకటేపల్లెలో కరపత్రాల అందజేత, రొంపిచెర్లలో...


పలమనేరు పట్టణంలో ప్రచారం


పెంగరగుంటలో స్టిక్కర్ అతికిస్తున్న నేతలు

కల్యాణం.. కమనీయం


విశేషాలంకరణల స్వామి, అమ్మవార్లు

శాంతిపురం: కెనమాకులపల్లిలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కళ్యాణోత్సవం కమనీయంగా జరిగింది. శ్రీలక్ష్మీనారాయణస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు. అనంతరం గరుడోత్సవం, కుంకుమార్చన నిర్వహించారు. అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

వేడుకగా శయనోత్సవం



రామకుప్పం: మండలకేంద్రంలో వెలసిన శ్రీఅన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఆది దంపతుల శయనోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. స్వామి,అమ్మవార్లకు ద్వాదశ హారతులిచ్చారు. అనంతరం వివిధ రకాల స్వీట్లు, పూలు, పండ్లు, ఫలహారాలను శయన మందిరంలో ఉంచి తలుపులు మూసి వేశారు. సోమశేఖర్ శెట్టి, బీ.వీ.నాగరాజు శెట్టి ఉభయదారులుగా వ్యవహరించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా


పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ కృష్ణారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా ఇస్తున్నట్లు ఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని మంగళంపేట సబ్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. మరమ్మతు పనులను పరిశీలించారు. ఎక్కడా లోవోల్టేజ్ లేకుండా చూస్తున్నామని తెలిపారు. జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఉచితంగా మీటర్, వైరు ఇస్తామని పేర్కొన్నారు. ఈఈ విజయన్, ఏడీ నరేంద్ర, ఏఈ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

పుష్పపల్లకిపై కోదండ రాముని వైభవం

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో కొలువుదీరిన శ్రీకోదండరామస్వామి ఆలయ శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి పుష్పపల్లకి సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సీతా, లక్ష్మణ, ఆంజనేయ సహిత శ్రీరామచంద్రమూర్తిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఉట్లు తిరనాళ్లను ఘనంగా నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి పుష్పపల్లకిపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం వసంతోత్సవం, సాయంత్రం శయనోత్సవంతో ఉత్సవాలను ముగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మకర్తలు సూదం



శెట్టి జానకిరామ్, పట్టాభిరామ్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే డాక్టర్ వెంకటేగౌడ పుష్పపల్లకి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు వైస్ ఎంపీపీలు జీడీ బాబు, ఆంజమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చౌడేపల్లె జాతర

చౌడేపల్లె: మండలకేంద్రంలో నడిబొడ్డున వెలసిన శ్రీనడివీధి గంగమ్మ జాతర ఈనెల 11,12 తేదీల్లో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహక కమిటీ సభ్యులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు అనంతరం చాకలివారి ఇంట కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా చౌడేపల్లె జాతరలోనే కల్యాణోత్సవం జరగడం విశేషం. సంప్రదాయ ప్రకారం సారె గంపను తీసుకెళ్లి నాయునివారి పాళ్యంలో ఉన్న శిలకు మేళతాళాల మధ్య పూజలు చేస్తారు. అనంతరం జాతర మొదలౌతుంది. కుమ్మరవీధికి చెందిన వెంకటరమణ ఇంట్లో అమ్మవారిని పెళ్లి కుమార్తెను చేసి పుర వీధులలో ఊరేగింపుగా తీసుకెళ్లి చాకల వీధిలోని మడివిలిరాజు ఇంట మడవిలి రాజుతో కల్యాణం నిర్వహిస్తారు. తదుపరి అమ్మవారిని నడివీధిలో కొలువుదీర్చి బెస్తవాని ఇంటి నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గట్టం కుండలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పిస్తారు. అనంతరం


నడివీధి గంగమ్మ అమ్మవారు(ఫైల్)

నల్ల గంగమ్మ, మారెమ్మ, బోయకొండగంగమ్మ, గ్రామదేవత చౌడేశ్వరీదేవీకి పట్టణ మహిళలు పిండి దీపాలతో ఆరాధనలు చేసి మొక్కులు చెల్లిస్తారు. మండల ప్రజలు సుఖశాంతులతో పాటు వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని పూజలు చేస్తారు. సీఐ మధుసూధనరెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ రవికుమార్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

భక్తులకు మెరుగైన సదుపాయాలు

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి
- ప్రత్యేక కౌంటర్లలో పుష్పాలు, నిమ్మపండు ప్రసాదం పంపిణీ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ దర్శనార్థం వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయలు కల్పించడమే లక్ష్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. ఆదివారం బోయకొండ ఆలయంలో రద్దీ కొనసాగింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై 4 గంటల పాటు ఆలయం, క్యూలను పరిశీలించారు. సమస్యలు, చేపట్టాల్సిన ఏర్పాట్లపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి భక్తుడికి సులభతరంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా సత్వర దర్శన భాగ్యం కల్పించేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఇప్పటికే వేసవిని దృష్టిలో ఉంచు కుని తాగునీటితో పాటు నీడ సౌకర్యం కల్పించా మని తెలిపారు.

ప్రసాదాల కౌంటర్ ప్రారంభం

ప్రతి భక్తుడికి దర్శనం అనంతరం అమ్మవారి కుంకుమ, నిమ్మపండు, పూలు, ప్రసాదం పంపిణీ కోసం ఆలయంలో నూతనంగా రెండు కౌంటర్లను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను తక్కువ ధరలకు విక్రయించేలా కూడా కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈఓ చంద్రమౌళి, పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లద్దూరమణ, నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, సురేంద్రరెడ్డి, నవీన్‌రెడ్డి, గిరిబాబు పాల్గొన్నారు.


భక్తుల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

పెద్దపంజాణి: అర్హతే ప్రామాణికంగా ప్రతి గడపకు సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. కొళత్తూరు పంచాయతీలోని మద్దలకుంట, గల్లావారిపల్లె, పాలేపల్లె, గుండ్లపల్లె, గుత్తివారిపల్లెలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, అధికారులతో కలసి 451 గృహాలకు వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించారు. సీఎం సందేశంతో కూడిన సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందజేశారు. స్థానికులు ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకురాగా, వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల కనుసన్నల్లో టీడీపీ మద్దతుదారులకే సంక్షేమ పథకాలు అందాయని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో ఇంటి వద్దకే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలలో విప్లవాత్మక సంస్కరణలతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని వివరిస్తూ రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, సింగిల్ విండో చైర్మెన్ ఓబుల్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, మండల కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సర్పంచ్‌లు రవికుమార్, భాస్కర్, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు ఎర్రబల్లి శ్రీనివాసులు, సురేష్, అధికారులు పాల్గొన్నారు.


సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

సీనియర్ పెన్షనర్లకు సన్మానం



పలమనేరు: స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. తొలుత విశ్రాంత ఉద్యోగుల పింఛన్లకు ఆద్యుడైన నకారామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. సంఘ నాయకులు గురురాజారావు, వాసుదేవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో నూతన అధ్యాయం

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రంలో నూతన అధ్యాయం ప్రారంభమైందని ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. ఆదివారం పట్టణంలోని సాయిబాబా గుడివీధి, ఎల్‌ఐసీ కాలనీ విస్తరణ ప్రాంతాల్లో జగనన్నే మాభవిష్యత్తు, మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగు ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకుని, ఫీడ్‌బ్యాక్ నమోదు చేసి రశీదు ఇచ్చారు. లబ్ధిదారుల సమ్మతితో ఇంటికి స్టిక్కర్లు అతికించారు, మిస్డ్‌కాల్ ఇప్పించి ముఖ్యమంత్రితో మాట్లాడించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్యాలెండర్‌ను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అన్నిరంగాల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందుతోందని స్పష్టం చేశారు. కులాలు, మతాలు, పార్టీలకతీతంగా పుంగనూరు నియోజకవర్గంలో అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందించి, ఆదర్శంగా నిలుస్తున్నట్లు ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. సోషియల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్‌కుమార్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, మల్లికార్జున, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

పలమనేరు: పట్టణంలోని పలు చర్చిలలో ఈస్టర్ సండేను ఆదివారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే రోజున ఏసు ప్రభువును శిలువ వేయగా ఆపై మూడో రోజు ఆయన పునరుద్ధానుడయిన సందర్భంగా ఈస్టర్ సండేగా జరుపుకుంటున్నట్టు చర్చి పెద్దలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు జరిగాయి. చర్చి నిర్వాహకులు, ఫాదర్లు, క్రైస్తవులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అదే విధంగా పలమనేరు పోలీస్ లైన్‌లోని లైట్ ఆఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కూడా ఈస్టర్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. రెవరెండ్ శ్యామ్యూల్, దివ్య, మేరీజాన్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు: పట్టణంలోని సీఎస్‌ఐ అట్టన్ మెమోరియల్ చర్చిలో క్రీస్తు పునరుద్ధాన పండుగను క్రైస్తవులు ఆదివారం వేకువ జాము నుంచి నిర్వహించారు. ఫాస్టర్ రాకేష్‌నిమ్రోడ్ మాట్లాడుతూ ఏసు క్రీస్తు శిలువై మూడవ రోజు సజీవుడై తిరిగిలేచారని తెలిపారు. ఏసుక్రీస్తు ఎన్నో శ్రమలకు ఓర్చి, పాపులను సైతం సన్మార్గంలో నడిపించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏసుప్రభువు కీర్తనలను ఆలాపించారు. ప్రత్యేకప్రార్థనలు నిర్వహించి, పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు బీసీ కాలనీ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ధనరాజ్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు పునరుత్థానాన్ని వివరించారు. క్రైస్తవులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. పాస్టర్లు ప్రభువు సూక్తులను వివరించారు. ప్రార్థనల అనంతరం అన్నదానం చేశారు.


పలమనేరు : ఈస్టర్ ప్రార్థనల్లో క్రైస్తవులు


కల్లూరు చర్చిలో..



పలనేరు : లైట్ ఆఫ్ మినిస్ట్రీస్ చర్చిలో ..